## తిరుపతికి అంతర్జాతీయ విమానం వచ్చేసిందోచ్!





డాక్టర్ రవిపిళ్లైకి స్వాగతం పలుకుతున్న కోలా ఆనంద్

రేణిగుంట, సెప్టెంబరు 1: ఎట్టకేలకు తిరుపతి విమానాశ్రయంలో తొలిసారిగా ఓ అంతర్జాతీయ విమానం సేఫ్‌గా ల్యాండైంది. 2015 నవంబరు 22వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా తిరుపతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. చంద్రబాబు ముందుచూపుతో అప్పట్లోనే అంతర్జాతీయ విమాన రాకపోకల కోసం అన్ని వసతులను కల్పించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్జాతీయ విమానాల రాకపోకలపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడటం, తిరిగి చంద్రబాబు సీఎం అయిన మూడు నెలల్లోపే అంతర్జాతీయ విమానం రావడంతో ఇటువంటి విమానాల రాకపోకలకు తొలి అడుగు పడిందనే చెప్పుకోవాలి. ఆదివారం మధ్యాహ్నం 12.11 గంటలకు బ్రహెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎంపైర్ ఏవియేషన్ విమానం నేరుగా తిరుపతి విమానాశ్రయంలో ల్యాండైంది. గల్ఫ్‌దేశంలో స్థిరపడిన కేరళకు చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ రవి పిళ్లై కుటుంబ సభ్యులతో కలిసి ఈ విమానంలో శ్రీవారి దర్శనార్థం తిరుపతికొచ్చారు. ఏటా శ్రీవారి దర్శనానికి వచ్చే ఈయన ఈసారి కేంద్రప్రభుత్వ అనుమతితో ప్రత్యేక విమానంలో వచ్చారు. దీనివల్ల భవిష్యత్తులో అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపడానికి ఇది తొలి అడుగుగా విమానాశ్రయ అధికారులు భావిస్తున్నారు. కాగా, రవిపిళ్లైకి విమానాశ్రయంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికారు.

## శ్రీవారి సేవలో హన్సిక



సినీ నటి హన్సిక ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన తల్లి మోనా మొత్వానితో కలిసి ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయం ముందుకు వచ్చిన హన్సికను అభిమానులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## ఫామ్‌హౌస్‌లో దువ్వూరు సమావేశం

● టీడీపీలో చేరికపై చర్చలు

తడ, సెప్టెంబరు 1: వైసీపీకి రాజీనామా చేసిన చెంగాళమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తన అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆదివారం ఈ సమావేశం జరిగింది. వైసీపీ ఆవిర్భావం నుంచి బలమైన నేతగా కొనసాగిన దువ్వూరు కొద్దిరోజుల కిందట ఆ పార్టీకి రాజీనామా చేశారు. అప్పటినుంచి ఆయన టీడీపీ గూటికి చేరేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ నేతలు కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయాన్ని రెండు నెలల కిందట టీడీపీ అధిష్ఠానం దృష్టికీ తీసుకెళ్లగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. కొద్దిరోజులక్రితం సదరు టీడీపీ నాయకులు మరోసారి అధినేత చంద్రబాబును హైదరాబాదులో కలవాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో దువ్వూరు తన వర్గీయులతో నిర్వహించిన సమావేశంలో టీడీపీలో చేరికపై చర్చించినట్లు తెలిసింది. వారం, పదిరోజుల్లో మరోసారి దొరవారిసత్రం వేదికగా సమావేశమై టీడీపీలో చేరికపై బహిరంగ ప్రకటన చేసేలా నిర్ణయించినట్లుగా సమాచారం. ఈ చేరికపై వేనాటి వర్గం గుర్రుగా ఉంది. ఎందుకంటే వైసీపీ ఆవిర్భావానికి ముందు దువ్వూరు టీడీపీతోనే తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. అప్పట్లో వారితో విభేదించి వైసీపీలోకి చేరడంతో రెండు వర్గాల మధ్య సఖ్యత లేదు. ఇపుడు దువ్వూరు టీడీపీలో చేరే ప్రయత్నాలను వేనాటి వర్గం అడ్డుకుంటుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏం జరుగుతుందో వేచి చూడాలి.

## డిప్యూటీ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు

సోమవారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ సైకత శిల్పాన్ని కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం సముద్రతీరాన ప్రముఖ సైకత శిల్పి, కళాకారుడు మంచాల సనత్‌కుమార్ ఆదివారం రూపొందించారు. ఈ క్రమంలో సనత్‌ను జనసేన నాయకులు సుందరరామిరెడ్డి, సుజయ్‌బాబు, తీగల చంద్రశేఖర్ అభినందించారు.





- కోట

## సముద్రంలో 'అల'జడి



శ్రీనివాససత్రం వద్ద, గోవిందపల్లిపాళెం వద్ద సముద్రంలో ఎగిసిపడుతున్న అలలు



కోట, సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కోట మండలం శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం సముద్రతీరంలో తహసీల్దారు జయజయరావు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. కోటలోని తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం కంట్రోల్ రూము ఏర్పాటు చేసి, సముద్ర తీరప్రాంతంలోని గ్రామాలపై నిఘా ఉంచారు. పంచాయతీల వారీగా అధికారులతో కమిటీలు వేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వాయుగుండం ప్రభావం వల్ల సముద్రం వెంబడి ఈదురుగాలులు, వర్షపుజల్లులు కురుస్తున్నాయి. సముద్రంలో అలల ఉధృతి పెరుగుతుండటంతో మత్స్యకారులు కూడా చేపల వేట నిలిపేశారు.

## నేడు విద్యాసంస్థలకు సెలవు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 1: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బంగాళా ఖాతంలో వాయుగుండం ఏర్పడినందున రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలన్నీ విధిగా తమ ఆదేశాలను పాటించాలన్నారు. అలాగే కలెక్టర్ ఆదేశాలతో డీఈవో శేఖర్ కూడా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించాలని ఆదేశాలు జారీ చేశారు.

## స్విమ్స్‌లో సీసీ కెమెరాలకు చిక్కిన రోగి

### ఒంటరిగానే నడిచి వెళుతున్నట్లు గుర్తించిన పోలీసులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1: స్విమ్స్‌లో ఐదు రోజుల కిందట కనిపించకుండా పోయిన టి.సీతారామప్ప అదే రోజు వార్డు నుంచి ఒంటరిగా బయటకు వెళ్లిపోయినట్లు తేలింది. స్విమ్స్‌లోని ఓ సీసీ కెమెరాలో దీనికి సంబంధించిన ఫుటేజీని పోలీసులు, స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. వైద్యం కోసం స్విమ్స్‌కు వచ్చి గత నెల 27వ తేదీన స్విమ్స్‌లోని ఏంఐసీయూ వార్డులో అడ్మిట్ అయిన రోగి టి.సీతారామప్ప అదే రోజు అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. అప్పటినుంచి పోలీసులు, స్విమ్స్ సెక్యూరిటీ రోగి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నా ఆచూకీ తెలియరాలేదు. మరోవైపు రోగి ఆచూకీ కోసం తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ రెండు ప్రత్యేక బృందాలనూ ఏర్పాటు చేశారు. ఆదివారం డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి స్విమ్స్ ఆవరణలో వెతికించారు. సీతారామప్ప చికిత్స పొందుతున్న వార్డు నుంచి భవనం వెనుక ఎస్వీ యూనివర్సిటీ వైపు వరకు జాగిలం వచ్చి అక్కడినుంచి వెనుదిరిగింది. అనంతరం శ్రీపద్మావతి భవనంలో ఉన్న సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా.. సీతారామప్ప అడ్మిట్ అయిన ఆగస్టు 27వ తేదీ అర్ధరాత్రి తర్వాత 3.15 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో భవనం వెనుక మార్గంలో నడుచుకుంటూ వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే సీతారామప్ప కుమారుడు విశ్వనాథ్‌ను పిలిపించి ఆ సీసీ ఫుటేజీలను చూపించగా తన తండ్రే అని గుర్తించాడు. అయితే గ్రౌండ్‌ఫ్లోర్‌లో నడుచుకుంటూ వెళుతున్న ఫుటేజీ మాత్రమే కనిపించడంతో ఆ భవనం వెనుకనుంచి ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలోకి వెళ్లి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఐదు రోజులుగా చిన్నపాటి ఆధారం కూడా లభించకపోవడంతో రోగి బంధువులు కూడా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇపుడీ సీసీ ఫుటేజీని చూసినవారు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కడికి వెళ్లి ఉంటాడన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, రోగిని ఎవరూ ఏమీ చేయలేదని ఆయనే వార్డు నుంచి బయటకు వెళ్లాడని, ఇందులో స్విమ్స్ యాజమాన్యం తప్పిదం లేదని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సీతారామప్ప ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న సీసీ కెమెరా పుటేజి

## పంచాయతీలకు మహర్దశ

● జిల్లాకు రూ.28.61కోట్ల నిధులు విడుదల

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 1: గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలన్నీ నిర్వీర్యం చేశారు. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీలకు జవసత్వాలు వచ్చాయి. 2023-24 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులను కోతలు లేకుండా పంచాయతీలకు విడుదల చేసింది. జిల్లాలో 774 పంచాయతీలు ఉండగా 15వ ఆర్థిక సంఘం రెండో విడత టైడ్ గ్రాంట్ కింద రూ.17.16కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్యానికి వినియోగించనున్నారు. అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.11.44కోట్లు విడుదలైంది. ఈ నిధుల్లో గ్రామాల్లో అంతర్గత రోడ్లు, కాలువ పనులు, మొక్కల పెంపకం, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, వీధిదీపాలు, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ, ఆరోగ్యకేంద్రాలు, పశువైద్యశాలల నిర్వహణ తదితర పనులకు ఉపయోగిస్తారు. మేజరు పంచాయతీలకు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు, మైనర్ పంచాయతీలకు రూ.90వేల నుంచి సుమారు రూ.4లక్షలు వరకే వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా రూ.28.61కోట్ల నిధులు ఆయా పంచాయతీలకు జమయ్యాయి. దీంతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 15వ ఆర్థిక సంఘం రెండో దఫా సుమారు మరో రూ.25కోట్లు మంజూరయ్యాయి.

**గ్రామాల అభివృద్ధికి నిధులు వినియోగిస్తాం**

గ్రామాల అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులు వినియోగిస్తాం. జనాభా ప్రాతిపదికన ప్రతి పంచాయతీకి నిధులు ఇస్తున్నాం. వీటిని సక్రమంగా వినియోగించడానికి అధికారులు, సర్పంచులు సహరించాలి.

- కలెక్టర్ వెంకటేశ్వర్

## ఏటీఎంలో చోరీ ఇంటి దొంగల పనే..!

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులున్నట్లు సమాచారం

ధ్వంసమైన ఏటీఎం (ఫైల్ ఫొటో)



చంద్రగిరి, సెప్టెంబరు 1: చంద్రగిరి పట్టణం కొత్తపేటలోని కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో గురువారం రాత్రి జరిగిన చోరీ ఇంటి దొంగల పనే అని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించినట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులున్నట్లు సమాచారం. విశ్వసనీయ కథనం మేరకు.. ఎస్బీఐ ఏటీఎంలలో నగదు పెట్టే ప్రైవేటు సిబ్బంది అయిన కస్టోడియన్ సురేష్ పథకం ప్రకారం ఈనెల 27వ తేదీన కోసూరి కాంప్లెక్స్‌లోని ఏటీఎం మెషీన్‌లో నగదు పెట్టి.. దానికి సంబంధించిన తాళం వేయకుండా, ప్రధాన డోరుకు సంబంధించిన తాళం వేసి వచ్చేశాడు. అదే రోజు రాత్రి నగదు తరలించే వాహన డ్రైవర్ మనోజ్‌కు విషయాన్ని తెలిపాడు. అతను తన స్నేహితుడు మనోజ్‌కు విషయం తెలిపి.. నగదు చోరీకి ప్రణాళిక రూపొందించారు. డ్రైవర్ స్నేహితుడైన మనోజ్ సెక్యూరిటీ వేషధారణలో వచ్చి సురేష్ వద్ద ఉన్న ప్రధాన డోరు తాళంతో ఏటీఎం తెరిచి లోపలున్న నగదును చోరీ చేశాడు. అనంతరం ఇది ఇంటి దొంగల పనే అన్న అనుమానం రాకుండా ఉండటానికి గడ్డపారతో ఏటీఎంను కదిలించి, ధ్వంసం చేశాడు. కాగా, వీరు చంద్రగిరిలోనే కాకుండా తిరుపతిలోని గిరిపురం, అన్నారావు సర్కిల్, తుమ్మలగుంట దగ్గర ఉన్న ఎల్ఎస్‌నగర్‌లోని ఏటీఎంలలో కూడా ఈ తరహాలోనే చోరీ చేసినట్లు గుర్తించారు. ఏటీఎం చోరీ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసి, మరో రెండ్రోజుల్లో నిందితులను అరెస్టు చూపి, రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం.

## పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 1: విజయవాడ నగర ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా రైలు మార్గాలపై వర్షపు నీరు ప్రవహించడంతో తిరుపతినుంచి సికింద్రాబాదు వెళ్లే ప్రత్యేక రైలు, ఆదిలాబాదు నుంచి తిరుపతికి వచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లను ఆదివారం రద్దు చేశారు. త్రివేంద్రం నుంచి న్యూఢిల్లీకి వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్‌ను కడప మార్గంలో దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ - గూడూరు మీదుగా చెన్నైకి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజర్లను అధికసంఖ్యలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి-విజయవాడ మధ్య నడిచే పలు రైళ్లను కూడా రద్దు చేసే అవకాశం ఉందన్నారు.

## తమిళనాడుకు తరలుతున్న రేషన్ బియ్యం

సముద్ర తీర మండలాలను కేంద్రంగా చేసుకున్న 'మాఫియా'

కోట, సెప్టెంబరు 1: తమిళనాడుకు మన రాష్ట్రం నుంచి రేషన్ బియ్యం యథేచ్ఛగా తరలిపోతోంది. సముద్ర తీర మండలాలను కేంద్రంగా చేసుకుని తమిళనాడు బియ్యం మాఫియా తన పనికానిచ్చేస్తోంది. సముద్రతీరంలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాలపై ఏడాదిన్నరగా ఈ మాఫియా కన్నేసింది. ఇక్కడ పోలీస్, విజిలెన్స్ నిఘా పెద్దగా లేదన్న కారణంగా స్థానిక చిరు వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని మన రాష్ట్రానికి చెందిన రేషన్ బియ్యాన్ని కారుచౌకగా కొనుగోలు చేసి తమిళనాడుకు తరలించుకుపోతోంది.

**బియ్యం సేకరణ ఇలా..**

చిరువ్యాపారులు బైక్‌లపై గ్రామాల్లోని చిన్న చిన్న దుకాణాలు, లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి కిలో రేషన్ బియ్యాన్ని రూ.12-15తో కొనుగోలు చేస్తారు. ఇలా సేకరించిన బియ్యాన్ని కోట మండలం విద్యానగర్, కోటల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడినుంచి ఆటోల ద్వారా తమకు అనుకూలమైన మండలాల్లోని రైసు మిల్లుల్లోకి రాత్రికి రాత్రే తరలించి, పాలిష్ చేయిస్తున్నారు. ఇలా పాలిష్ చేసిన బియ్యాన్ని తిరిగి విద్యానగర్‌కు చేర్చి, అక్కడినుంచి అర్ధరాత్రి నాయుడుపేట, చిట్టమూరు మండలం కొత్తగుంట మీదుగా చెన్నైకి లారీల్లో తరలించేస్తున్నారు. చెన్నై సిటీ సరిహద్దులో కిలో బియ్యాన్ని రూ.28-30 మధ్య విక్రయిస్తున్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్ ఫొటో)

**పట్టించుకునే వారేరీ? :** రేషన్ బియ్యం పల్లెల నుంచి పక్క రాష్ట్రానికి వెళుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. లారీలో బియ్యం తరలివెళ్లేటప్పుడు కొన్నిశాఖల అధికారులకు మామూళ్లను మాఫియా ఇస్తోందన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇకనైనా బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# టీడీపీ వర్గీయుడిపై వైసీపీ నేత దాడి

భాకరాపేట, సెప్టెంబరు 1: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటకు చెందిన టీడీపీ వర్గీయుడు యశ్వంత్‌పై స్థానిక వైసీపీ నేత భూపాల్ దాడి చేసినట్లు బాధితుడు భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు... వైసీపీ నేత, భాకరాపేట సర్పంచ్ భూపాల్ గతంలో చేసిన అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో తనపై ఆగ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. పోలీసులు తనను పిలవడంతో ఆదివారం స్టేషన్ వద్దకు వెళుతుండగా భూపాల్ వచ్చి అడ్డగించి దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడని చెప్పాడు. తాను తప్పించుకుని పోలీసు స్టేషన్‌లోకి వెళ్లానని, అక్కడ కూడా దాడి చేయబోగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపాడు. దీంతో తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యశ్వంత్ తెలిపాడు. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. ఇరువురు ఘర్షణ పడి ఫిర్యాదు చేసుకున్నారని, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.53 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.53 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 81,207 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,414 మంది తలనీలాలు సమర్పించారు.

## భద్రతా ప్రమాణాలు పాటించడంలో 'మెయిల్' అంకితభావంతో పనిచేస్తుంది


మెయిల్ సిబ్బందిని సత్కరిస్తున్న నేషనల్ హైవే అథారిటీ అధికారులు

భాకరాపేట, సెప్టెంబరు 1: 'మెగా ఇంజనీరింగ్ సంస్థ(మెయిల్)' భద్రతా ప్రమాణాలు పాటించడంలో అంకితభావంతో పనిచేస్తుందని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ గోపీకృష్ణ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం సమీపంలోని మెయిల్ బేస్ క్యాంపులో సిబ్బందితో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మెయిల్ సంస్థ పీలేరు-కాలూరు ప్రాజెక్టులో గాయాలు లేకుండా ఒక మిలియన్ సేఫ్ అవర్స్ సాధించిందన్నారు. ప్రస్తుతం పీలేరు-కాలూరు రహదారి నిర్మాణంలో ఇదే విధమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. మెయిల్ సేఫ్టీ డిపార్టుమెంట్ రవిరెడ్డి, సభ్యులు మురళీకృష్ణ, విజయకుమార్ రెడ్డి, మస్తాన్, షరీఫ్, లతీఫ్‌లను సత్కరించారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 1: నగరంలోని మున్సిపల్ పార్కులో ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, ప్రకాశం మున్సిపల్ పార్కు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ.. ఈ వైద్యశిబిరంలో దాదాపు 280మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ ప్రతిమ, వైద్యులు, సిబ్బంది, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



పాకాల, సెప్టెంబరు 1: మండలంలోని దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశమయ్యారు. 40 సంవత్సరాల తరువాత కలిసిన వీరు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు పి.ఆనందయ్య, కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జాయింట్ సెక్రటరీ జి.వెంకటముని, కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, మహ్మద్ రఫీ, గోపి, ఖాదర్ బాషా, శ్యామల, రాధ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ భజన మందిర నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదు


మాట్లాడుతున్న చాముండేశ్వరి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 1: తిరుపతి రూరల్ మండలం కాలూరులో చేపట్టిన రాములవారి గుడి (శ్రీరామ భజన మందిరం) నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదని గ్రామస్తురాలు చాముండేశ్వరి పేర్కొన్నారు. గ్రామంలోని హనుమంతరాయస్వామి ఆలయం వద్ద కొందరు మహిళలతో కలసి ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గ్రామంలో దశాబ్దాలకిందట నిర్మించిన రాములవారిగుడి శిధిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తుల అంగీకారంతో పునర్నిర్మాణానికి పూనుకున్నామని, దీనికి దేవదాయ, ధర్మాదాయశాఖ నిధులను కూడా మంజూరు చేసిందని వివరించారు. అయితే గ్రామానికి చెందిన చింతకాయల జయమ్మ కుటుంబీకులు ఈస్థలం తమదని అడ్డుకోవడంతో పోలీసుల రక్షణలో భూమిపూజ చేసి నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆస్థలం తమదని వారు ఆలయ నిర్మాణానికి అడంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దీనిని ప్రశ్నించిన గ్రామస్తులపై దాడికి దిగుతున్నారని, మహిళలని కూడా చూడకుండా దాడి చేస్తున్నారని వాపోయారు. ఇనాందారి గ్రామంలో ఉన్న రాములవారి ఆలయ స్థలం తమదని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. గ్రామాభివృద్ధిని కాంక్షించి చేపట్టిన పవిత్ర కార్యాన్ని అడ్డుకోవడం మానుకోవాలని కోరారు. గతంలో కలెక్టర్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులను కలసి ఆలయ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న విషయాన్ని తెలియజేశామని వివరించారు. కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులు స్పందించి వెంటనే ఈ స్థల వివాదాన్ని పరిష్కరించాలని వేడుకున్నారు. మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముగ్గురు ఎర్ర స్మగ్లర్ల అరెస్టు


పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 1: కడప జిల్లా పత్తూరు అటవీప్రాంతంలో ఆదివారం టాస్కుఫోర్సు పోలీసులు కూబింగ్ నిర్వహించి ఎర్రచందనం చెట్లను నరికేందుకు అడవిలోకి చొరబడుతున్న ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. టాస్కఫోర్సు ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐలు సురేష్‌బాబు, విష్ణువర్ధన్ కుమార్ బృందాలు ఆదివారం తెల్లవారుజామున కడప జిల్లా ప్రొద్దుటూరు రేంజిలోని పత్తూరు అటవీ పరిధిలో కూంబింగ్ నిర్వహించారు. నాగేశ్వరకోన చేరుకునే సరికి అక్కడ అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు కనిపించారు. వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, వీరి వద్ద రెండు పిడిలేని ఇనుప గొడ్డళ్లు లభించాయి. వీరిని ప్రశ్నించగా, ఎర్రచందనం కోసం అడవుల్లోకి వెళుతున్నట్లు చెప్పారు. వీరిని తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు. వీరిని తిరుపతి టాస్కఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

# పాకాలలో ఘనంగా ప్రారంభోత్సవాలు


నూతన బస్సు సర్వీసు ప్రారంభించి, నడుపుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని


జనసేన పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, పసుపులేటి హరిప్రసాద్

పాకాల, సెప్టెంబరు 1: పాకాలలో ఆదివారం ఎమ్మెల్యే పులివర్తి నాని చేతులమీదుగా పలు ప్రారంభోత్సవాలు జరిగాయి. పాకాలలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు తలారి గురునాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే నాని, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, చిత్తూరు టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌ల చేతులమీదుగా ప్రారంభించారు. స్థానిక అంజనేయస్వామి ఆలయం గుడివద్ద నుంచి పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాకాల ఆర్టీసీ బస్టాండులో నూతనంగా రెండు బస్సు సర్వీసులను ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. తిరుపతి-బెంగళూరు, తిరుపతి-కాణిపాకం వయా పాకాల మీదుగా నడిపే ఈ బస్సులకు పూజలు నిర్వహించి, కూటమి నాయకులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. తిరుపతి-బెంగళూరు బస్సును ఎమ్మెల్యే స్వయంగా నేంద్రగుంట వరకు నడిపారు. ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజల కోరిక మేరకు ఈ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దేవర మనోహర్, సుభాషిణి, టీడీపీ నాయకుడు వలపల దశరథ నాయుడు, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, కార్యదర్శి ఫల్గుణ, ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్, తిరుపతి, అలిపిరి డిపో మేనేజర్లు టి.బాలాజీ, ఎస్.హరిబాబు, స్థానిక ఆర్టీసీ కంట్రోలర్ ఎ.రవిచంద్ర, నాయకులు కె.సావిత్రి, ఉమాపతి నాయుడు, ఎ.బాలాజీ, ఎల్.కోటి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# సీమలో జనసేనను బలోపేతం చేద్దాం

- క్రియాశీలక సభ్యత్వ నమోదులో తిరుపతికి మొదటి స్థానం రావడం సంతోషం
- సభ్యత్వ నమోదులో చొరవ చూపిన వారికి ఎమ్మెల్యే సన్మానం


నరసింహులు నాయుడికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 1: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదులో రాయలసీమలో తిరుపతికి మొదటి స్థానం రావడం సంతోషంగా ఉందని, సీమలోని ప్రతి నియోజకవర్గంలో జనసేనను బలోపేతం చేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని, క్రియాశీలక సభ్యత్వ నమోదులో చొరవచూపిన వారికి ఆదివారం ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో అభినందన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కేక్ కట్‌చేసి పవన్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జన సైనికుల పట్టుదల, కృషి, చొరవతోనే తిరుపతి ముందంజలో నిలిచిందన్నారు. గత ఏడాది 4,954 మంది జనసేన సభ్యత్వం తీసుకుంటే ఈఏడాది 16,011 మంది క్రియాశీలక సభ్యులుగా చేరారన్నారు. 2019లో ఒక సీటు గెలిచిన జనసేన 2024లో పోటీచేసిన 21 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లో గెలిచి దేశ ఎన్నికల చరిత్రలో రికార్డు నెలకొల్పిందని ఆనందం వ్యక్తం చేశారు. సభ్యత్వ నమోదులో ఎక్కువమందిని చేర్పించిన ఆరణి మదన్ మొదటి స్థానంలో నిలవగా ఆయన రాలేకపోవడంతో ఆరణి శివ జ్ఞాపిక అందుకున్నారు. ఆతర్వాత స్థానంలో నిలిచిన దినేష్ జైన్, జనసేన నేత రిటైర్డ్ తహసీల్దార్ నరసింహులు నాయుడు, ఆముదాల వెంకటేష్, మాధవరావులు వరుసగా ఎమ్మెల్యే చేతులమీదుగా జ్ఞాపికలు స్వీకరించారు. జనసేన నేత మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, కీర్తన, ఆకేపాటి సుభాషిణి, ముక్కు సత్యవంతుడు, నైనార్ శ్రీనివాస్, సత్యనారాయణ, రాజేష్ ఆచారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల రాజకీయ వేదిక కాకూడదు

### ఆర్కే రోజా వ్యాఖ్యలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్


కొండపల్లి శ్రీనివాస్

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దైవనిలయమైన తిరుమల.. రాజకీయ వేదిక కాకూడదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమలలో వైసీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ తీవ్ర స్థాయిలో చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఆమె చేసిన విమర్శలు ఈ రెండుమూడు నెలల్లో జరిగినవి కాదన్నారు. భగవంతుడి ఆశీస్సుల కోసం వచ్చినప్పుడు రాజకీయాలు మాట్లాడకూడదన్నారు. ఇక, రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరగాలని, రాష్ట్రాన్ని అన్నివిధాల ముందుకు తీసుకువెళ్లాలని స్వామిని ప్రార్థించినట్టు తెలిపారు. సీఎంతో కలిసి పనిచేస్తున్న తమకు మరింత శక్తి, ధైర్యం ప్రసాదించాలని కోరుకున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో ఏర్పడిన ఇబ్బందులన్నీ తొలగిపోవాలని కోరుకున్నానన్నారు.

### ప్రజలంతా సంతోషంగా ఉండాలని ప్రార్థించా: మంత్రి సంధ్యారాణి



రాష్ట్రంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్టు మంత్రి సంధ్యారాణి తెలిపారు. శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు మొదటిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి నేటికి 30 ఏళ్లు అయిందన్నారు. ఆయనకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వడంతో పాటు రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందేలా ఆశీస్సులు ఇవ్వాలని ప్రార్థించానన్నారు. ఇక, మాజీ మంత్రి ఆర్కే రోజా చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నకు.. పవిత్రస్థలమైన తిరుమలలో వాళ్ల గురించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు.

## టీటీడీ సీఈ సత్యనారాయణకు అభినందనలు


సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేశ్వరరావు

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చీఫ్ ఇంజనీర్(సీఈ)గా టీవీ సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. సీనియారిటీ ఉన్నప్పటికీ తనకు చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పించలేదని, తనకన్నా జూనియర్‌గా ఉన్న నాగేశ్వరరావుకు పదోన్నతి కల్పించారంటూ ఎస్ఈ సత్యనారాయణ కొన్నేళ్లుగా కోర్టు ద్వారా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. కోర్టు కూడా స్పందిస్తూ సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా పదోన్నతి కల్పించాలని, సీఈ పోస్టుకు సత్యనారాయణ అర్హుడని స్పష్టం చేసింది. డీపీసీ(డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) నియమ నిబంధనలు పాటిస్తూ సత్యనారాయణను 2020 నుంచే సీఈగా పరిగణించాలని గత జూలై నెలలో తీర్పు వెలువడిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన బదిలీల్లో ఆయన ఎస్ఈ-2 కింద తిరుపతినుంచి తిరుమలకు వచ్చారు. ఈక్రమంలో ప్రస్తుతం సీఈగా ఉన్న నాగేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో సీనియారిటీ ప్రకారం సత్యనారాయణను సీఈగా టీటీడీ నియమించింది. దీంతో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఆదివారం పలువురు అధికారులు, కాంట్రాక్టర్లు సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.



భాకరాపేట ఘాట్‌లో బోల్తాపడిన లారీ - లారీని ఢీకొన్న స్కూటర్

## భాకరాపేట ఘాట్‌లో కర్రల లారీ బోల్తా

- అదే లారీని ఢీకొన్న స్కూటర్
- ముగ్గురికి గాయాలు

చంద్రగిరి, సెప్టెంబరు 1: చంద్రగిరి మండల పరిధిలోని తిరుపతి, మదనపల్లె జాతీయ రహదారిలో భాకరాపేట ఘాట్ రోడ్డులో కర్రల లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈక్రమంలోనే భాకరాపేట నుంచి తిరుపతి వైపు వస్తున్న స్కూటర్ లారీని ఢీకొంది. ఈప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. రాయచోటి నుంచి భద్రాచలానికి కర్రల లోడుతో లారీ వెళుతుండగా మార్గమధ్యంలోని భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఇంతలోనే చంద్రగిరికి చెందిన బాలాజీ భార్య స్వాతి, వదిన మీనలు స్కూటర్‌పై వస్తుండగా బోల్తా పడిన లారీని ఢీకొన్నారు. ఈప్రమాదంలో స్కూటర్‌పై వస్తున్న బాలాజీ, స్వాతి, మీనకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న చంద్రగిరి ఎస్ఐ రవీంద్రనాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చంద్రగిరిలో మహిళ మోసగించిందని..

### ధర్మవరంలో పోలీసులకు వ్యాపారి ఫిర్యాదు


సాయికుమార్

ధర్మవరం, సెప్టెంబరు 1: చంద్రగిరికి చెందిన కందుకూరి గాయత్రి తనవద్ద పట్టు చీరలను కొనుగోలు చేసి మోసగించిందని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత వ్యాపారి ముత్తురెడ్డి సాయికుమార్ ధర్మవరంలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఆయన మీడియాకు వివరాలు తెలిపారు. గాయత్రి తన వద్ద రూ.50 లక్షల విలువైన పట్టు చీరలు అప్పుగా తీసుకుని నగదు చెల్లించకుండా నెలలు తరబడి తిప్పించుకుంటుందని ఆరోపించారు. నెలలు గడుస్తున్నా అప్పు చెల్లించక పోవడంతో అనుమానం వచ్చి చంద్రగిరికి వచ్చి నగదు ఇవ్వమని కోరినా స్పందించక పోవడంతో తిరుపతిలో పీజీఆర్ఎస్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే శుక్రవారం డబ్బులు కోసం చంద్రగిరిలోని ఆమె ఇంటి ముందు బైఠాయించగా, స్థానిక పోలీసులొచ్చి చీరల లావాదేవీలు ధర్మవరంలో జరిగాయి కనుక అక్కడే ఫిర్యాదు చేయాలని సూచించారన్నారు. ధర్మవరంలో తనతోపాటు 15 మందిని కూడా ఇదే తరహాలో మోసం చేసిందని, తమిళనాడులో వ్యాపారులకు రూ.20 కోట్లు ఎగవేసినట్లు అక్కడ పత్రికలలో కథనాలు వచ్చినట్లు వివరించారు. ఇకనైనా తనకు న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించారు.

## వెంకన్న సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకమండపంలో వేదపండితులు జస్టిస్‌కు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, అంతకుముందు ఏపీ హైకోర్టు రిజిస్ట్రారు కమలాకర్‌రెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



జస్టిస్ రాజేశ్వరరావు - కమలాకర్‌రెడ్డి

## వేశాలమ్మ ఆలయ స్థలం స్వాధీనం


ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

తిరుపతి, సెప్టెంబర్ 1 (ఆంధ్ర జ్యోతి): దేవదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని పల్లివీధి వేశాలమ్మ ఆలయానికి చెందిన స్థలంలోని ఆక్రమణలను ఆలయ అధికారులు తొలగించారు. ఆలయ సమీపంలోని స్థలంలో చిన్నపాటి షెడ్డును వేసుకుని తన స్వాధీనంలో ఉంచుకున్న ఓ వ్యక్తికి, దేవదాయశాఖకు చాలా ఏళ్లుగా కోర్టులో వివాదం నడిచినట్లు తెలిసింది. ఆలయానికి అనుకూలంగా తీర్పురావడంతో దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవో మమత నోటీసులు జారీ చేశారు. పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

- ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగుల ఆవేదన



ఎన్టీఆర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 1: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆదివారం టౌన్‌క్లబ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి సేవ్ మై జాబ్ అంటూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రరావు పిలుపుతో జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు టౌన్‌క్లబ్ కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ డిగ్రీలు చదివి రాష్ట్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో చేరామని చెప్పారు. ఐదేళ్లుగా సేల్స్‌మెన్‌గా, సూపర్‌వైజర్లుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించామన్నారు. మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న 15వేల కుటుంబాలు రోడ్డు పాలు కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు ఆరో తేదీ వరకు వినూత్న రీతిలో శాంతియుత కార్యక్రమాలు చేస్తామన్నారు.

## ఎన్టీఆర్ తరువాత గొప్ప నటుడు బాలయ్య


స్వీట్లు పంచి సంబరాలు చేసుకొంటున్న బాలయ్య అభిమానులు

చంద్రగిరి, సెప్టెంబరు 1: తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్టీఆర్ తరువాత అంత గొప్ప నటుడు నందమూరి బాలకృష్ణ అని ఆయన అభిమాన సంఘం నాయకుడు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్ నాయుడు అన్నారు. నందమూరి బాలయ్య చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఆదివారం బాలయ్య అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకొన్నారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు. నరేష్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ బాలయ్య మరెన్నో చిత్రాలలో నటించాలన్నారు. ఈకార్యక్రమంలో బాలయ్య అభిమానులు లక్ష్మీపతిరెడ్డి, మధు, మేడసాని రాజా నాయుడు, గాలి ధనంజయలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మామండూరు వద్ద లారీ బోల్తా



చంద్రగిరి, సెప్టెంబరు 1: చంద్రగిరి మండలం మామండూరు వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం తెల్లవారు జామున లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ మధుకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు కర్నాటక రాష్ట్రం, ముల్బాగల్ నుంచి ఇంటీరియల్ మెటీరియల్ లోడుతో తిరుపతికి వస్తుండగా, మార్గమధ్యంలో మామండూరు వద్దకు రాగానే లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ మధుకు స్వల్ప గాయాలయ్యాయి. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే లారీ అదుపు తప్పి బోల్తా పడిందని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీవారిమెట్టు చిరు వ్యాపారుల నిరసన


టీటీడీ పరిపాలనా భవనం ముందు నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

చంద్రగిరి, సెప్టెంబరు 1: తిరుపతిలో టీటీడీ పరిపాలన భవనం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీవారిమెట్టు చిరు వ్యాపారులు చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీవారిమెట్టు చిరు వ్యాపారులు తమ వ్యాపారం చేస్తున్న చిరుతిళ్లతో నిరసన తెలిపారు. చిరు వ్యాపారులు మాట్లాడుతూ.. శ్రీవారిమెట్టు మార్గంలో ఏళ్ల తరబడి వ్యాపారం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నామని, టీటీడీ చిరు వ్యాపారులను అక్కడ నుంచి పంపించేయడం సరికాదని, తమకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

## కొబ్బరి చెట్టుకు రెండు కొమ్మలు


రెండు కొమ్మలుగా విడిపోయిన కొబ్బరి చెట్టు

రామచంద్రాపురం, సెప్టెంబరు 1: కొబ్బరి చెట్లు నిటారుగా పెరిగి పైభాగంలో ఒంబాలకు కాయలు కాయడం విదితమే. అయితే 20 ఏళ్ల క్రితం నాటిన కొబ్బరి చెట్టు 20అడుగులు పెరిగిన తరువాత రెండు కొమ్మలుగా విడిపోయి పెరుగుతోంది. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే రెండు కొమ్మల నుంచి ఒంబాలు వచ్చి విపరీతంగా కాయలు కాస్తోంది. కొబ్బరి చెట్టు సహజంగా 100 నుంచి 200 కాయలు కాస్తాయి. అయితే గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి అనే రైతు పొలం వద్ద రెండు కొమ్మలతో కొబ్బరి చెట్టు 700 కాయలకుపైగా కాస్తోంది.

## 2047కి వికసిత్ ఆంధ్రా చంద్రబాబు లక్ష్యం



మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 1: 2047నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుగుణమ్మ తెలిపారు. ఆదివారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు తొలిసారి సీఎం బాధ్యతలు చేపట్టి ఆదివారం నాటికి 29ఏళ్లు పూర్తిచేసుకొని 30వ సంవత్సరంలోకి ప్రవేశించారని అభినందించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆయన రాజకీయ రంగాన్ని ఎంచుకున్నారన్నారు. ఆయనకున్న రాజకీయ దక్షతతో 28ఏళ్లకే ఎమ్మెల్యే, 30ఏళ్లకే మంత్రిగా, 45ఏళ్లకు ముఖ్యమంత్రి పదవిని అధిరోహించారని గుర్తు చేశారు. నాలుగోసారి సీఎం పదవిలో కొనసాగుతుండడం తెలుగుప్రజలకే గర్వకారణమన్నారు. కోస్తాలో వర్షబీభత్సంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారని సంబరాలు వద్దని పార్టీ కార్యాలయం నుంచి ఆదేశాలు అందడంతో విరమించుకున్నామన్నారు. సూరా సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, కృష్ణయాదవ్, మన్యం శ్రీనివాసులు, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆముదాల తులసి, మునిశేఖర్‌రాయల్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మత్తులో వాహన యజమానిపై హత్యాయత్నం

### దుండగుల కోసం గాలింపు చర్యలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 1: గంజాయి మత్తులో వాహన యజమానిపై గుర్తు తెలియని దుండగులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి... వెదురుకుప్పం మండలం చిన్నగారిపల్లికి చెందిన రమేష్ టాటా ఏస్ వాహనంలో లగేజీలు తోలుతూ జీవనం గడుపుతున్నాడు. ఈక్రమంలో శనివారం తన వాహనంలో బ్యాటరీలు తీసుకెళ్లి నాయుడుపేట-శ్రీకాళహస్తి మార్గంలోని ఒక బ్యాటరీ కంపెనీలో అన్‌లోడ్‌చేసి వచ్చాడు. శనివారం అర్ధరాత్రి దాదాపు 1.30 నుంచి 2 గంటల ప్రాంతంలో తనపల్లి క్రాస్ లోని గ్రీన్ ల్యాండ్ కేఫ్ వద్ద వాహనం ఆపి టీ తాగుతుండగా గుర్తు తెలియని దుండగులు ఇద్దరు అతడి వద్దకు వచ్చారు. అప్పటికే గంజాయి సేవించి వున్న వారు మత్తులో అతడి వద్దకెళ్లి వాహనం ఇక్కడ ఎందుకు ఆపి టీ తాగుతున్నావు అంటూ ఒక్కసారిగా దాడికిదిగారు. రమేష్ వారిని అడ్డుకోగా, దుండగుల్లో ఒకరు తన వద్ద వున్న కత్తితో అతడిపై దాడి చేశాడు. మరో దుండగుడు చేతులు, కాళ్లపై కొట్టడంతో అతడు స్పృహ తప్పి పడిపోయాడు. విషయం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రమేష్ మణికట్టు, ఎడమ వైపు కడుపుపై బలమైన గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. డీఎస్పీ నరసింగప్ప ఆదేశాల మేరకు పోలీసులు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హైవేపై వున్న సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో గత 10 రోజుల వ్యవధిలో మూడు చోట్ల చోటు చేసుకున్నా పోలీసులు గంజాయి బ్యాచ్‌ను గుర్తించి అరెస్టు చేయడంలో విఫలమవుతున్నారు. పోలీసుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.



చికిత్స పొందుతున్న రమేష్

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 1: రెండ్రోజుల క్రితం తిరుచానూరు-తిరుపతి ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రుయాలో చికిత్స పొందుతున్న మణికంఠ నాయక్(30) ఆదివారం మృతి చెందారు. ఈస్ట్ సీఐ మహేశ్వరరెడ్డి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెకి చెందిన మణికంఠ నాయక్ శుక్రవారం ఎస్వీనగర్‌లోని తన చెల్లెలు ఇంటికి ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి ఫ్లైఓవర్‌పై నగరంలోకి బయలుదేరారు. ఆసమయంలో స్థానిక పీఎస్-4 హోటల్ వద్ద అతివేగంగా అడ్డదారిలో వస్తున్న లగేజీ ఆటో ఢీకొంది. ఈఘటనలో ఆయనకు తీవ్రరక్త గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం రుయాలో చేర్పించారు. రెండ్రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. లగేజీ ఆటో డ్రైవర్ గోపాల్ నాయక్‌పై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## నేడు ఎస్వీయూ 70వ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ 70వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించుకోనున్నారు. ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలోని మహనీయుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహిస్తారు. ఇందులో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు పాల్గొంటారు. విద్యార్థులు, ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు.

## బీసీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయండి

### మంత్రి సవితమ్మకు తెలుగు యువత వినతి



మంత్రి సవితమ్మకు విన్నవిస్తున్న ఆనంద్‌గౌడ్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1: ఎస్వీయూలో బీసీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మకు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ విన్నవించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో పాటు మంత్రి సవితమ్మను కలిసి ఆదివారం ఆయన వినతిపత్రం అందజేశారు. రాయలసీమలో ముఖ్య కేంద్రమైన తిరుపతిలోనే ఎక్కువ మంది విద్యార్థులు పోటీ పరీక్షల కోసం చదువుకుంటున్నారని, వీరికి అన్ని పోటీ పరీక్షలకు శిక్షణ, వసతి కల్పించేలా చూడాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు ఎస్వీ యూనివర్సిటీ అనువైన కేంద్రమని ఆనంద్‌గౌడ్ ఈ సందర్భంగా సూచించారు.

## సీపీఎస్‌ను రద్దు చేయాలని బైక్‌ర్యాలీ



అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 1: సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ పాత పింఛన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు ఆదివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఒక్కటే సర్వీస్ ఒక్కటే పింఛన్, సీపీఎస్ రద్దు ఓపీఎస్ ముద్దు అంటూ వందలాది మంది టీటీడీ ఉద్యోగులు పరిపాలన భవనం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. రుయాఆస్పత్రి, టౌన్‌క్లబ్, నాలుగుకాళ్లమండపం, అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకొని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎస్‌డబ్ల్యూయూఎఫ్ నాయకులు గోల్కొండ వెంకటేశం, కాటా గుణశేఖర్, పూజారి రత్నప్రభాకర్, నైనారు పద్మనాభవం, పట్నం దయాకర్, వెంకటముని, సీపీఎస్ అసోసియేషన్ నాయకులు శ్రీలక్ష్మి, రవికుమార్, హనుమంత్‌రెడ్డి, రాజశేఖర్, హేమచంద్ర, ప్రతిభా భారతి, హేమలత, పృథ్వీరాజ్, ఉపేంద్ర, రజనీకాంత్, బాలాజీ, గిరిధర్, శ్రీనివాసులు, రేవంత్, వెంకటేష్, అరుణాయుధం, పరంధామయ్య పాల్గొన్నారు.

## ఆలయం ముందు చెత్త దిబ్బ తొలగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 1: స్థానిక కరుమారియమ్మ ఆలయం వద్ద ఉన్న చెత్త దిబ్బను ఆదివారం ఉదయమే తొలగించారు. ఆంధ్రజ్యోతిలో 'చెత్తదిబ్బను తొలగించరా' ఫొటో వార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం ట్రాక్టర్, కూలీలతో ఆలయం వద్దకు చేరుకొని చెత్తదిబ్బను పూర్తిగా తొలగించారు. ఆ స్థలమంతా పరిశుభ్రం చేశారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## స్విమ్స్‌లో బీఎస్సీ, బీపీటీ కోర్సులకు రేపటినుంచి వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1: స్విమ్స్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(నర్సింగ్), బీపీటీ, బీఎస్సీ(పారామెడికల్) కోర్సుల ప్రవేశానికి ఈనెల 3 నుంచి 4వ తేదీ వరకు 2వ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్ వెబ్‌సైట్‌లో లింకు ద్వారా కోర్సులను విద్యార్థులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా సమాచారం వస్తుందన్నారు.

## జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణను అడ్డుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 1: దేశంలో జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు పిలుపునిచ్చారు. స్థానిక పెద్దకాపు లేఅవుట్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం సంఘం సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జాతీయ బ్యాంకులను గత పదేళ్లుగా ప్రైవేటీకరణ చేస్తుండటంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వానికి కూడా నష్టం సంభవిస్తోందని అన్నారు. ఆదాయాల్లో వున్న బ్యాంకులను కూడా ప్రైవేటు పరం చేయడానికి ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వి.ఉదయ్‌కుమార్, ఏపీటీబీఈఎఫ్ కార్యదర్శి కె.రమాప్రసాద్‌లు మాట్లాడుతూ.. ఈ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని జాతీయ బ్యాంకుల ఉద్యోగులు సుదీర్ఘ పోరాటాలు చేస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు జె.ధన్వంతకుమార్, పి.వి జయభాస్కర్, పి.మురళి, భాస్కర్, జనార్ధన్, సుమలత. రేష్మా, నిర్మలా దేవి, యగ్నేష్‌బాబు, నందగోపాల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు,కార్యకర్తలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 1: అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ దేశం గత కొన్ని నెలలుగా పాలస్తీనా దేశంపై చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట పాలస్తీనాపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆదివారం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ.. ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. దాడులను ఆపాలని ఐక్యరాజ్యసమితి పలుమార్లు ఇజ్రాయిల్‌ను ఆదేశించినా అమలు చేయడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం కూడా ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సరఫరా చేయడం అన్యాయమన్నారు. ఈదాడులు ఆపని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు బాల సుబ్రహ్మణ్యం, కె.వేణుగోపాల్, ఆర్.లక్ష్మీ, ఎస్.జయచంద్ర, మునిచంద్రా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్‌బీఐ 'యూనియన్ డే'



ఎస్‌బిఐ తిలక్ రోడ్డుశాఖలో యూనియన్ డేను నిర్వహించుకున్న ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 1: తిరుపతి తిలక్‌రోడ్డు శాఖలో ఆదివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ యూనియన్ డే వేడుక (ఐదవ వార్షికోత్సవం)లను సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక తిలక్ రోడ్డుశాఖలో తిరుపతి జిల్లా నుంచి ఎస్‌బీఐ అవార్డు ఉద్యోగులు 250 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ ఉపాధ్యక్షుడు వీవీ ప్రసాద్, డివిజన్ జనరల్ సెక్రటరీ కేవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. యూనియన్ సాధించిన విజయాలను వివరించారు. సభ్యుల సంక్షేమ పథకాల అమలు గురించి, యూనియన్ సాధించిన విజయాల గురించి వివరించారు. ఈసందర్భంగా ఉద్యోగుల పిల్లలకు పోటీలు నిర్వహించి, గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. యూనియన్ నాయకులు కె.గిరిధర్, కె.శ్రీకాంత్, పి.సురేష్, యూనియన్ సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అనాథ ఆశ్రమాల్లో వేడుకలు జరుపుకోవాలి



అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఐఎంఏ నేతలు

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 1: పుట్టిన రోజు, పెళ్లిరోజు వంటి వేడుకలను అనాథ ఆశ్రమాల్లో జరుపుకోవడం అలవరుచుకుంటే అయిన వారికి దూరమైన అనాథలకు మనం ఉన్నామనే ధైర్యం ఇచ్చిన వారవుతామని ఐఎంఏ తిరుపతి బ్రాంచి అధ్యక్షుడు జనార్ధన్ అన్నారు. ఐఎంఏ తిరుపతి బ్రాంచి మాజీ అధ్యక్షుడు వాసుదేవ నాయుడు జన్మదిన వేడుకలను సంస్థ ఆధ్వర్యంలో తిరుచానూరులోని నవజీవన్ అనాథ ఆశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనాథలకు అండగా మేమున్నామనే భరోసా ఇచ్చేందుకు వాసుదేవ నాయుడు తన జన్మదిన వేడుకలను ఇక్కడ జరుపుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. నవజీవన్ అనాథ ఆశ్రమానికి నెల రోజులకు సరిపడా బియ్యం, నిత్యావసరాలు, విద్యార్థులకు స్వీట్లు అందజేశారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, ఐఎంఏ నేతలు కృష్ణకాంత్, వెంకట్రమణ, శివచంద్రరాజు, జయచంద్ర, నవజీవన్ ట్రస్టు అధ్యక్షుడు శ్రీధర్ ఆచార్య పాల్గొన్నారు.

## తక్షణమే సీపీఎస్ రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 1: తక్షణమే సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పిలుపు మేరకు ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తామంటున్న యూపీఎస్, జగన్ ప్రభుత్వం ప్రకటించిన జీపీఎస్ తమకు అవసరం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే సంవత్సరంలోపు సీపీఎస్ సమస్యను పరిష్కరిస్తామని ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇతర కూటమి నాయకులు బహిరంగంగా అనేకసార్లు చెప్పారన్నారు. ఉద్యోగులు, ప్రజలు వారిని అత్యధిక మెజారిటీతో గెలిపించారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట వారు నిలబెట్టుకోవాలని కోరారు. మాట నిలబెట్టుకోలేదంటే ఓపీఎస్ సాధించేవరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు, అధ్యక్షులు రమేష్‌బాబు, ఆర్థిక కార్యదర్శి కటారి మోహన్‌రెడ్డి, తిరుపతి డివిజన్ కన్వీనర్ వాసు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి దేవేంద్ర, రాష్ట్ర నాయకులు యువశ్రీ మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, జనసేన, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఆదివారం సూళ్లూరుపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి బంగ్లాలో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. పవన్, మెగా అభిమానులు స్వచ్ఛందంగా విచ్చేసి రక్తదానం చేశారు. పవన్ పేరుతో భారీకేక్ కట్‌చేసి అందరికి పంచారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, పార్థసారధి, జనసేన నాయకులు ఆవుల రమణ, మాబాషా, జగదీష్, రాము, దాసు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

వెంకటగిరి, సెప్టెంబరు 1: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పవన్‌కళ్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా రక్తదానం గొప్పదన్నారు. అనంతరం రక్తం దానం చేసిన యువతకు జనసేన ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం పట్టణ అధ్యక్షుడు అనిల్ రామారావు, జిల్లా జనసేనపార్టీ కార్యదర్శి రాధమ్మ, జాయింట్ సెక్రటరీ అరవ రాజేష్, ఉపాధ్యక్షుడు కోనా రవిశంకర్, ప్రధానకార్యదర్శి కె వెంకటేశ్వరరావు, రామ్మోహన్, తిరుమలేష్, మస్తాన్, అశోక్, రామారావు, ఎపి అందుల సంఘం అధ్యక్షులు పచ్చూరు పెంచల నరసయ్య నాయుడు తదితరులు వున్నారు.

## ఎన్టీఆర్ కాలనీలో పోలీసు తనిఖీలు

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు1: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో సీఐ రమణ ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి సిబ్బందితో కలిసి ఒక ప్రాంతాన్ని ఎంచుకుని వాహనాలు పరిశీలించామన్నారు. ఎటువంటి పత్రాలులేని 6 వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. వాహన యజమాని పత్రాలు తీసుకుని వస్తే పరిశీలించి వారికి అందిస్తామని, తీసుకుని రాకపోతే కోర్టుకు పెడుతామని తెలిపారు.

## పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

గూడూరు, సెప్టెంబరు 1: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం భద్రత లేకపోవడం దారుణమన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను రద్దుపరిచి ఓపీఎస్‌ను అమలు పరిచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన పెన్షన్ విధానం ద్వారా ఉపాధ్యాయులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బాబు, జయపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివకుమార్, చంద్రశేఖర్, శివప్రసాద్, కోటేశ్వరరావు, మురళి, లోకనాధం, చంద్రశేఖర్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గూడూరు, సెప్టెంబరు 1: స్థానిక జీఎంయూపీ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎంయూపీ పాఠశాలలో 1986-87 విద్యాసంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థులు 37 సంవత్సరాల తరువాత చదివిన పాఠశాలలో కలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ పాఠశాలలో చదివి వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు ఓ వేదికపై కలుసుకుని పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపామన్నారు. పాఠశాల అభివృద్ధికి త్వరలోనే చర్యలు చేపడుతామని తెలిపారు.

## నేడు ఎస్వీయూ 70వ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ 70వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించుకోనున్నారు. ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలోని మహనీయుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహిస్తారు. ఇందులో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు పాల్గొంటారు. విద్యార్థులు, ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు.

## టీడీపీ వర్గీయుడిపై వైసీపీ నేత దాడి

భాకరాపేట, సెప్టెంబరు1:చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటకు చెందిన టీడీపీ వర్గీయుడు యశ్వంత్‌పై స్థానిక వైసీపీ నేత భూపాల్ దాడి చేసినట్లు బాధితుడు భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు... వైసీపీ నేత, భాకరాపేట సర్పంచ్ భూపాల్ గతంలో చేసిన అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో తనపై ఆగ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. పోలీసులు తనను పిలవడంతో ఆదివారం స్టేషన్ వద్దకు వెళుతుండగా భూపాల్ వచ్చి అడ్డగించి దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడని చెప్పాడు. తాను తప్పించుకుని పోలీసుస్టేషన్‌లోకి వెళ్లానని, అక్కడ కూడా దాడి చేయబోగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపాడు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు యశ్వంత్ తెలిపాడు. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. ఇరువురు ఘర్షణ పడి ఫిర్యాదు చేసుకున్నారని, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### గంజాయి మత్తులో
## వాహన యజమానిపై హత్యాయత్నం
### దుండగుల కోసం గాలింపు చర్యలు



చికిత్స పొందుతున్న రమేష్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 1: గంజాయి మత్తులో వాహన యజమానిపై గుర్తు తెలియని దుండగులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి... వెదురుకుప్పం మండలం చిన్నగారిపల్లికి చెందిన రమేష్ టాటా ఏస్ వాహనంలో లగేజీలు తోలుతూ జీవనం గడుపుతున్నాడు. ఈక్రమంలో శనివారం తన వాహనంలో బ్యాటరీలు తీసుకెళ్లి నాయుడుపేట-శ్రీకాళహస్తి మార్గంలోని ఒక బ్యాటరీ కంపెనీలో అన్‌లోడ్‌చేసి వచ్చాడు. శనివారం అర్ధరాత్రి దాదాపు 1.30 నుంచి 2 గంటల ప్రాంతంలో తనపల్లి క్రాస్‌లోని గ్రీన్ ల్యాండ్ కేఫ్ వద్ద వాహనం ఆపి టీ తాగుతుండగా గుర్తు తెలియని దుండగులు ఇద్దరు అతడి వద్దకు వచ్చారు. అప్పటికే గంజాయి సేవించి వున్న వారు మత్తులో అతడి వద్దకెళ్లి వాహనం ఇక్కడ ఎందుకు ఆపి టీ తాగుతున్నావు అంటూ ఒక్కసారిగా దాడికిదిగారు. రమేష్ వారిని అడ్డుకోగా, దుండగుల్లో ఒకరు తన వద్ద వున్న కత్తితో అతడిపై దాడి చేశాడు. మరో దుండగుడు చేతులు, కాళ్లపై కొట్టడంతో అతడు స్పృహ తప్పి పడిపోయాడు. విషయం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రమేష్ మణికట్టు, ఎడమ వైపు కడుపుపై బలమైన గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. డీఎస్పీ నరసింగప్ప ఆదేశాల మేరకు పోలీసులు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హైవేపై వున్న సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో గత 10 రోజుల వ్యవధిలో మూడు చోట్ల చోటు చేసుకున్నా పోలీసులు గంజాయి బ్యాచ్‌ను గుర్తించి అరెస్టు చేయడంలో విఫలమవుతున్నారు. పోలీసుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

## నేడు మహానవావరణ హోమం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 1: స్థానిక సీఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో సోమవారం సాయిసత్సంగ నిలయం ఆధ్వర్యంలో 700వ మహానవావరణ హోమపూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం హోమ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లోకశాంతి కోసం అనేక ప్రాంతాల్లో ఇప్పటికే 699 నవావరణ హోమాలను పూర్తి చేశామని 700వ హోమపూజల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఉచిత వైద్యశిబిరం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 1: స్థానిక గాంధీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నెల్లూరుకు చెందిన వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాల్యాద్రి, డాక్టర్ విజయ, సంపత్‌కుమార్, సురేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, సెప్టెంబరు 1: మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## రేపటి నుంచి కుంభాభిషేక ఉత్సవాలు

గూడూరు, సెప్టెంబరు 1: స్థానిక గ్రామదేవత తాళమ్మ ఆలయంలో పునర్నిర్మించిన గంగాభవానీ ఆలయంలో ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కుంభాభిషేక ఉత్సవాలను జరుపనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక తాళమ్మ ఆలయం వద్ద సభ్యులు మాట్లాడుతూ గంగాభావానీ అమ్మవారి గుడి శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, శ్రీనివాసులు, చెంచయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

### 14వ వార్డులో
## వీధి లైట్లు ఏర్పాటు చేయండి

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 1: మున్సిపాలిటీలోని 14వ వార్డులో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు వినతి పత్రం అందించారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆఫీసు నుంచి ఇందిరమ్మ కాలనీ, బొగ్గులమిట్ట వరకు వీధి లైట్లు కావాలని కోరారు. వీటిని వెంటనే మంజూరు చేసి ప్రజలు ఇబ్బందులను తొలగించాలని కోరారు.

## దూరాన ఉన్నా.. పింఛన్ పంపిణీ



పెళ్లకూరు, సెప్టెంబర్, 1 : పెళ్లకూరు గ్రామానికి చెందిన పింఛన్‌దారు అనారోగ్య పరిస్థితిలో దొరవారిసత్రం మండలం తల్లంపాడు ఉన్నందున సచివాలయ ఉద్యోగి అక్కడికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. మండల కేంద్రమైన పెళ్లకూరు గ్రామానికి చెందిన మైలారి నారమ్మ వృద్ధాప్యం కారణంగా కాలు జారి కిందపడిపోయింది. దీంతో కాలు విరగడంతో తల్లంపాడులోని తన కుమార్తె ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న సచివాలయ సర్వేయర్ లక్ష్మణ్ ఆదివారం తల్లంపాడుకు చేరుకున్నారు. నారమ్మ వద్ద వేలి ముద్రలు తీసుకుని పింఛన్ నగదును అందజేశారు.

## చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలి



చెరువు పనులను పరిశీలిస్తున్న ఇంజినీర్ మహేశ్

పెళ్లకూరు, సెప్టెంబర్, 1 : మండలంలోని చిల్లకూరు చెరువు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ మహేశ్ తెలిపారు ఆదివారం ఆయన చెరువు కట్ట అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. చెరువు కట్టను బలోపేతం చేస్తున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సర్పంచు పగడాల హరిబాబురెడ్డికి సూచించారు.

## వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

వాకాడు, సెప్టెంబరు 1 : భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రామయ్య ఓ ప్రకటనలో కోరారు. వర్షాల నేపథ్యంలో పాఠశాలలకు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వరరావు సెలవు ప్రకటించారని విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు వారి వారి ఇళ్లల్లో ఉండాలన్నారు.

## పట్టలు, నీళ్ళ డ్రమ్ముల పంపిణీ



చిట్టమూరు, సెప్టెంబర్ 1 : మండల పరిధిలోని యల్లసిరి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వలీంటీర్లు మధు, గోపాల్ ఆధ్వర్యంలో పట్టలు, డ్రమ్ములను ఆదివారం పంపిణీ చేశారు. యల్లసిరి పంచాయతీలో 30 మంది రైతులకు నల్ల పట్టలు, నీళ్ల డ్రమ్ములను టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాపులూరు చెంచురామయ్య చేతుల మీదుగా పంపిణీ జరిగింది.టీడీపీ నాయకులు రామయ్య, రాజారామిరెడ్డి, మణి, ప్రతాప్‌రెడ్డి, నాగూరయ్య, జాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చవితికి సిద్ధమైన వినాయక విగ్రహాలు



విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్న కళాకారుడు, గజవాహనంపై ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వినాయక ప్రతిమ, అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

గూడూరు, సెప్టెంబరు 1: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలో వినాయక విగ్రహాల అమ్మకాలకు తయారీదారులు సిద్ధం చేస్తోన్నారు. ఈనెల 7వ తేదీన వినాయచవితి సందర్భంగా తయారీదారులు వినాయక విగ్రహాలను వివిధ రంగులతో, వివిధ ఆకృతులలో, వివిధ వాహనాలపై కొలువుతీరిన విఘ్నేశ్వరుడి ప్రతిమలను తీర్చిదిద్దుతున్నారు. స్థానిక కోర్టుసెంటర్ సమీపంలో నాలుగు తయారీకేంద్రాలలో వెయ్యికి పైగా వినాయక విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఉండేలా గత 6 నెలలుగా విగ్రహాలను తయారు చేస్తున్నట్లు తయారీదారులు చెబుతున్నారు. ఈ ఏడాది అడుగు విగ్రహం నుంచి 15 అడుగుల వరకు విగ్రహాలను రూపొందించినట్లు చెబుతున్నారు. విగ్రహాలు రూ. 3 వేల నుంచి రూ.80వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ముడి సరకులు, కూలీల ఖర్చులు, ముడిసరకులపై జీఎస్టీ పెరగడంతో విగ్రహాల ధరలు గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 20శాతం వరకు పెరిగినట్లు చెబుతున్నారు. గూడూరు పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఉత్సవ నిర్వాహకులు తమకు నచ్చిన విగ్రహాలను ముందుగానే కొనుగోలు చేసేందుకు వస్తుండడంతో దుకాణల వద్ద పండుగ వాతావరణం సంతరించుకుంది. వినాయకచవితిని ప్రతి వీధిలో, ప్రతిగ్రామంలో వాడవాడలా సందడిగా జరుపుకొంటారు.

### వినాయక ప్రతిమలకు పెరిగిన డిమాండ్

**కోట :** కోట పట్టణంలో గత ఏడాది కంటే వినాయక విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. కోట పట్టణంలోని పలు చోట్ల వ్యాపారులు వినాయక విగ్రహాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఒక్కొక్క విగ్రహం 5వేల నుంచి 25వేల రూపాయల వరకు పలుకుతోంది. పల్లెల నుంచి కోటకు యువకులు వచ్చి పోటాపోటీగా విగ్రహాలను కొనుక్కొని వెళ్తున్నారు. పల్లెల్లో ముందస్తు వినాయక చవితి సంబరాలు మొదలయ్యాయి.



కోటలో వినాయక విగ్రహాలు

## తరలుతున్న వినాయక విగ్రహాలు

నాయుడుపేట, సెప్టెంబరు 1 : వినాయక చవితి సెప్టెంబరు 7వ తేదీ కావడంతో ముందస్తుగా చవితి నిర్వాహకులు వినాయక విగ్రహాలను కొనుగోలుచేసి ముందస్తుగా తమ గమ్యాలకు తరలిస్తున్నారు. నాయుడుపేట దర్గావీధిలో భారీగా ఏర్పాటు చేస్తున్న వినాయక చవితి సెట్టింగ్‌లలో అమర్చేందుకు ఆదివారం దాదాపు 20 అడుగుల పైగా ఉన్న వినాయక విగ్రహాన్ని తరలించారు. విగ్రహం ఎత్తు ఎక్కువగా ఉండటంతో విద్యుత్‌శాఖ అధికారులు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సమన్వయంగా వినాయక విగ్రహాలను తరలింపు చేశారు.



వినాయక చవితికి తరలిపోతున్న గణనాథ విగ్రహాలు

# తాగునీటి సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 1 : అవసరమైతే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోకి తెలుగు గంగ నీటిని మళ్లించి పట్టణంలో తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. వెంకటగిరి పట్టణ వాసులకు తాగునీటి అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంకును ఆదివారం ఆయన తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. మోటార్లు పనితీరును పరిశీలించిన ఆయన వెంటనే మరమ్మతులకు గురైన మోటార్లకు యుద్ధ ప్రాతిపదికన రిపేర్లు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు అడుగు భాగానికి చేరుకోవడం వల్ల నీటి సమస్య తలెత్తితే తెలుగుగంగ నీటిని ట్యాంకులోకి పంపింగ్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, జిల్లా గ్రంధాలయ మాజీ ఛైర్మన్ దొంతు శారద, రాష్ట్ర తెలుగుయువ ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు, అంధుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పచ్చూరి పెంచలనరసయ్య నాయుడు, నాయకులు మంకు ఆనంద్, కౌన్సిలర్లు డిల్లీ బాబు తదితరులు వున్నారు.



సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

# యువత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : ఎమ్మెల్యే పాశిం

గూడూరు, సెప్టెంబరు 1: యువత క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఏపీ రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రసాద్‌నాయుడు సహకారంతో ఏర్పాటు చేసిన జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. స్టేడియంలో వాకింగ్ చేసే వారికి, క్రీడాకారులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆధునాతన నూతన జిమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఉన్న జిమ్ శిథిలావస్థకు చేరడంతో స్టేడియంలోని క్రీడాకారులు సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో క్రీడాకారులకు, యువతకు ఆధునాతన జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే స్టేడియంలో శిథిలావస్థకు చేరుకున్న గ్యాలరీని తొలగించి నూతన గ్యాలరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాత్రి సమయంలో కూడా వాకింగ్ చేసుకునే విధంగా విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ జిమ్‌ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్‌నాయుడు, వేగూరు రాజేంద్రప్రసాద్, సురేంద్రనాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, రజిని, గిరి పాల్గొన్నారు.



జిమ్ చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

## రిటైర్డు హెచ్‌ఎంకు సన్మానం



మాట్లాడుతున్న హెచ్‌ఎం గిరిధర్‌బాబు

కోట, సెప్టెంబరు 1 : గోవిందపల్లిపాళెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్‌పిఎస్ పూర్ణానంద బాబు ఉద్యోగ విరమణ చెందడంతో ఆదివారం కోటలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మస్తానయ్య, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డిలు పూర్ణానందబాబును శాలువాలు, మెమెంటోలతో అభినందించారు.

## వృద్ధులకు అన్నదానం



నాయుడుపేట, సెప్టెంబర్, 1 : నాయుడుపేటలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పెళ్లకూరు మండలం అర్ధమాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పాలచ్చూరు నరేంద్రయాదవ్, మంజుల దంపతులు ఆదివారం అన్నదానం చేశారు. తన కుమారుడు సుశాంత్ కృష్ణ పుట్టిన రోజు వేడుకలను వృద్ధాశ్రమంలో జరిపి తన సేవాభావాన్ని చాటుకున్నారు. అక్కడే కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు వృద్ధులకు అందజేశారు.

### రాష్ట్రస్థాయి కెల్లో ఇండియా
## ఉమెన్స్ లీగ్‌లో పేట క్రీడాకారుల ప్రతిభ





నాయుడుపేట, సెప్టెంబరు1 : తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి కెల్లో ఇండియా ఉమెన్స్ లీగ్ పోటీలలో నాయుడుపేట క్రీడాకారులు ప్రతిభ కనపరచినట్లు తైక్వాండో జిల్లా కోశాధికారి, కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. నాయుడుపేటకు చెందిన దీపిక క్యోరిగి క్యాడెట్ విభాగంలో ప్రథమస్థానం, జి. కృష్ణ, జశ్విత, పోమ్ససే క్యాడెట్ విభాగంలో ప్రథమస్థానం సాధించారు. వీరిని తైక్వాండో అసోసియేషన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోచ్‌లు అభినందించారు. ఈ క్రీడాకారులు సెప్టెంబరు 11 నుంచి 14 వరకు జాతీయస్థాయిలో చెన్నైలో జరుగు పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు.

## ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

నాయుడుపేట, సెప్టెంబరు 1 : ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న వర్కర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. నాయుడుపేటలో ఆదివారం మద్యం దుకాణాల వర్కర్లు పురవీధుల్లో ర్యాలీ కొనసాగించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద తమ నిరసన తెలియజేశారు. కొత్త ప్రభుత్వం నూతన మద్యం విధానాలతో తమ ఉపాధి కోల్పోతుందని వాపోయారు.

**కోట :** కోట పట్టణంలో ఆదివారం ప్రభుత్వ మద్యంషాపుల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలలోని ప్రభుత్వ మద్యంషాపుల్లో పనిచేసే సెక్యూరిటీ, సూపర్ వైజర్లు, ఆపరేటర్లు తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మద్యం దుకాణాలు ప్రైవేట్ పరంకాబోతున్నాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా వేరే ఉద్యోగాలు కల్పించాలన్నారు.

## మొలకలపూడిలో రక్తదాన శిబిరం

చిట్టమూరు, సెప్టెంబర్ 1 : ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మొలకలపూడిలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, జనసేన నాయకులతో కలసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 51 మంది యువకులు ముందుకొచ్చి రక్తం దానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న బలరామయ్య, రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు జిల్లా జనసేన అధ్యక్షుడు తీగల చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బసవనూరు భాస్కర్, మండల జనసేన అధ్యక్షుడు క్రాంతి, కుమార్, శేఖర్, శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో మహోద్యమంలా నేత్రదానం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 1: జిల్లాలో ఆగస్టు 25 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు 39వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సూళ్లూరుపేటలో ఎంఎం చంద్రబాబుతో పాటు అలపాటి అశోక్‌కుమార్, మన్నెమాల శ్రీనివాసులు, వాకచర్ల సాయిలు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ తరఫున ఒక మహోద్యమంలా నేత్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ నిర్వహిస్తున్న బృహోత్తర కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సూళ్లూరుపేట కాకుండా సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో పలు గ్రామాల నుంచి నేత్రదానం చేస్తున్నారు.

## జానపద కళల పరిరక్షణకు కృషి



సమావేశంలో ప్రజానాట్యమండలి,వామపక్ష నాయకులు,తదితరులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: జానపద కళను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వామపక్ష నాయకుడు హరినాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ప్రజాచైతన్య జానపద కళాఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ కళాకారులకు అవసరమైన పరికరాలతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అంతకు ముందు కళాకారులు అంబేడ్కర్ కూడలి నుంచి భారీర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సినీ దర్శకులు బీమాస్ అశోక్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య, జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు కృష్ణచైతన్య, నాగరాజు, కాళయ్య,నాగభూషణం, బలరాం, ముకుంద, కత్తి రవి, జనమాల గురవయ్య పాల్గొన్నారు.

## పచ్చదనంతో స్వచ్ఛమైన ప్రాణవాయువు

కేవీబీపురం, సెప్టెంబరు 1: మండలంలోని రాయపేడులోని అంగన్‌వాడీలో ఆదివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత ఆధ్వర్యంలో పచ్చదనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనం పెంపొందిస్తే స్వచ్ఛమైన ప్రాణవాయువు పొందవచ్చన్నారు. అనంతరం అంగన్‌వాడీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

## విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక చెకుముకి పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వేదిక నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: మూఢ విశ్వాసాలను పారదోలి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందని సంస్థ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా టాలెంట్ టెస్టు పోస్టర్లను ఆవిష్కరించారు. వేదిక రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు, గ్రామీణ శాస్త్రవేత్త చంద్రశేఖర్, నాయకులు షరీఫ్, సీఐటీయూ నాయకులు అంగేరిపుల్లయ్య, పెనగడం గురవయ్య, శ్రీనివాసులు,చెంగయ్య, కుప్పస్వామి, రామమూర్తి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిక్షణపై చిత్రలేఖన పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ నరసింహమూర్తి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సురేష్‌బాబు, విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయుడు మునస్వామి, సంస్థ సభ్యులు నారాయణ, షేక్ షరీఫ్, శ్రీనివాసులు, అంజయ్య, చంద్రకాంత్, రాజశేఖర్, రమణ, సాయి, ప్రదీప్‌కుమార్, పార్థసారథి పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: టీడీపీలో రెండు ముఖ్య ఘట్టాలను పురస్కరించుకుని భరద్వాజ తీర్థం సమీపంలోని స్వయంభు సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పేదలకు అన్నదానం చేశారు. చంద్రబాబునాయుడు మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 30వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా, సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నట జీవితాన్ని 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. రెడ్డివారి గురవారెడ్డి, దశరథాచారి, దొరై రాజ్‌రెడ్డి, మునిరాజా యాదవ్, మునెయ్య, ఈశ్వరరెడ్డి, మంగారెడ్డి, బత్తు యాదవ్, మురళియాదవ్, శివారెడ్డి పాల్గొన్నారు. **ఏర్పేడు:** అండబేడ్కర్ కూడలి వద్ద సంబరాల్లో జయచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం, కృష్ణవేణి, బాలాజీయాదవ్, గోల్డ్ మాన్‌నాయుడు, నిరంజన్, మునెయ్య, రమణ, గుణయాదవ్ పాల్గొన్నారు.

## నేడు పంచాయతీ కార్యదర్శిపై డీఎల్‌పీవో విచారణ

రేణిగుంట, సెప్టెంబరు 1: కరకంబాడీ పంచాయతీ పరిధిలో రూ.2 కోట్ల వ్యయ లెక్కలపై సోమవారం విచారణ జరగనుంది. కార్యదర్శిగా పనిచేసిన రామాంజనేయులురెడ్డి ఈ పనులకు రికార్డులు సమర్పించలేదని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. స్థానిక సీపీఎంకు చెందిన వార్డు మాజీ సభ్యురాలు రాజ్యలక్ష్మి దీనిపై స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో ప్రభురెడ్డి సోమవారం విచారించనున్నారు.

## డ్రగ్స్ వాడినా,విక్రయించినా పీడీ కేసు నమోదు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 1: యువత మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనమవుతుందని ఎస్ఐ విశ్వనాథ నాయుడు అన్నారు. కాటూరులో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా పీడీ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# శ్రీకాళహస్తి సత్యవేడు

## ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ గోపీనాథ్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపీనాథ్, ఆర్‌పీ గ్రూప్ ఫౌండర్ చైర్మన్ రవి పిళ్లై వేర్వేరు సమయాల్లో దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, సొసైటీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా స్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద ఆయనకు వేదపండితులు ఆశీర్వచనమిచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అధికారులు, టీడీపీ నాయకులు కామేష్ యాదవ్, బాలాజీరెడ్డి, ప్రవీణ్‌కుమార్, దామోదర్‌రెడ్డి, దుర్గ, వినయ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

వరదయ్యపాళెం, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని గోవర్దనపురంలో ఆదివారం మెగా రక్తదాన, ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. యువత రక్తదానం చేశారు. 180 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. 40మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. కార్యక్రమాల్లో జిల్లా నాయకులు కిరణ్‌రాయల్, తడ శ్రీను, విజయకుమార్, దొడ్డి శేఖర్, వెంకటేష్, బీజేపీ నాయకులు దిలీప్‌రాయల్, టీడీపీకి చెందిన శ్రీనునాయుడు, హరిప్రసాద్‌రెడ్డి, మునిభూషణమ్మ, కరుణాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పాత వీరాపురంలో స్టార్టర్ల చోరీ

ఏర్పేడు, సెప్టెంబరు 1: పాత వీరాపురంలో 23 మంది రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల స్టార్టర్లను దుండగులు అపహరించుకుపోయారు. గ్రామానికి చెందిన రామిరెడ్డి, రవిచంద్రారెడ్డి, రామ్మూర్తి, రవి, భూమిరత్నం తదితర రైతులకు చెరువుకు ఆనుకుని పొలాలు ఉన్నాయి. పొలాల్లో సాగునీటి మోటార్లకు సంబంధించిన స్టార్టర్లను శనివారం రాత్రి అపహరించుకుపోయారు. బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు.

## కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో సుమారు 27వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,209మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,430మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,385మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 997, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 267మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 253మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 78మంది భక్తులు పూజలు చేయించుకున్నారు.

## భూ బాధితులకు న్యాయం: సుధీర్



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: రాజీవ్‌నగర్ కాలనీలో వైసీపీ కబ్జాదారుల చెరతో ఇళ్ల స్థలాలు కోల్పోయిన నిరుపేద లబ్ధిదారులకు న్యాయం చేయడమే ధ్యేయంగా సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నుంచి రాజీవ్‌నగర్ అక్రమాలపై సర్వే ప్రారంభం కానున్నట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులందరూ నిర్భయంగా సర్వే అధికారులకు సహకరించాలన్నారు. కచ్చితంగా అందరికీ న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

## ఎన్టీఆర్ నగర్‌లో కార్డన్ సెర్చ్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: అనుమానిత వ్యక్తులు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని ఒకటవ పట్టణ సీఐ గోపి సూచించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలమేరకు ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన రికార్డులు లేని 12 ద్విచక్ర వాహనాలను, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ రవినాయక్, ఎస్ఐలు సుధాకర్, ఈశ్వర్, విశ్వనాథనాయుడు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# అలంకారప్రాయంగా అగ్రిల్యాబ్

- ఆర్భాట ప్రకటనలకే పరిమితం
- రెండేళ్లుగా భవనం మూత



సత్యవేడు, సెప్టెంబరు 1: సత్యవేడులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రచార ఆర్భాటాల కోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన అగ్రిల్యాబ్ ఆరంభ శూరత్వంగా మిగిలింది. భవనాన్ని నిర్మించి రెండేళ్లవుతున్నా పరికరాలను సమకూర్చక పోవడంతో ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. అగ్రిల్యాబ్‌ల ద్వారా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయంలో గణనీయమైన అభివృద్ధి సాధిస్తారని గత వైసీపీ ప్రభుత్వం ప్రచారాలతో ఊదరగొట్టింది. క్షేత్ర స్థాయిలో చూస్తే రైతులను మభ్యపెట్టడానికే తప్ప ఇతర ఉపయోగం లేదని తేలిపోయింది. ప్రతీ నియోజకవర్గంలో ఒక అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు నాటి జగన్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ఆత్మ కార్యాలయం వెనుక అగ్రిల్యాబ్ భవనాన్ని నిర్మించింది. 2022 జూలై 8న వైస్సార్ జయంతి సందర్భంగా అప్పటి కలెక్టర్ వెంకటరమణా రెడ్డి దీనిని లాంఛనంగా ప్రారంభించారు. తర్వాత ప్రారంభోత్సవంతోనే సరిపెట్టేశారు. ఈ రెండేళ్ళలో అగ్రిల్యాబ్ తలుపులు ఒక్క రోజయినా తెరుచుకున్న పాపాన పోలేదు. కనీసం భవనం అందుబాటులోకి వస్తే పంటలకు సంబంధించి రసాయన మందులు, స్థానికంగానే విత్తన పరీక్షలు నిర్వహించి నాణ్యతను నిర్ధారించుకోవచ్చు. తద్వారా రైతులు సాగులో అధిక దిగుబడులు సాధించే వీలుంది. పశు సంవర్థక శాఖ, మత్స్యశాక తదితర వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి కూడా వివిధ పరీక్షలను, సేవలను పొందవచ్చు. కూటమి ప్రభుత్వం ఈ భవనాలపై దృష్టి సారించాల్సి ఉంది. అగ్రిల్యాబ్‌కు అవసరమైన సిబ్బందిని నియమించి పరికరాలను సమకూర్చితే అగ్రిల్యాబ్ అందుబాటులోకి వస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

## రౌతుసూరమాలలో ఉచిత కంటి వైద్య సేవలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: రౌతుసూరమాలలో చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆరవింద్ కంటి ఆస్పత్రి నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో వందమందికిపైగా వైద్యపరీక్షలు చేయించుకున్నారు. 50మందికి మందులు అందచేశారు. 28 మందికి కంటి అద్దాలు అందించనున్నారు, 24 మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఈవో సీతారామానాయుడు, రాజేంద్రనాథ్‌రెడ్డి, ట్రస్టు ఏవో కృష్ణ గల్లా, శంకర్ పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవి రాదనే ఎమ్మెల్యేపై విమర్శలు : టీడీపీ



సమావేశంలో ఇళం గోవన్‌రెడ్డి, తదితరులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 1: నీతికి నిజాయితీకి మారుపేరైన ఎమ్మెల్యే ఆదిమూలంపై కొండూరు బాలరాజు అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఏఎంసీ మాజీ చైర్మన్, ప్రస్తుత క్లస్టర్ ఇన్‌చార్జి ఇళం గోవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. బాలరాజు ఆరోపణలను ఆయన ఖండించారు. బాలరాజును పార్టీ నుంచి బహిష్కరించాలని అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి నిస్వార్థంగా పని చేస్తున్న పలువురు నాయకులను కాదని తమిళనాడులో ఉంటూ ఎన్నికల ముందు స్వయం ప్రకటిత రాష్ట్ర పదవి పేరిట అహంకారంతో ప్రవర్తించడం తగదన్నారు. నామినేటెడ్ పదవి రాదనే అక్కసుతోనే ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేకు ఆరోగ్యం సరిలేనందున ఆయన అల్లుడు జాన్ కెనడి సహకారం అందిస్తున్నారన్నారు. విద్యావంతుడు, విశ్వాసపాత్రుడైన కెనడి ఉండడం ఎమ్మెల్యేకు మంచిదన్నారు. వాసురెడ్డి, భక్తారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు. **కేవీబీపురం:** ఎమ్మెల్యే ఆదిమూలంను టీడీపీ నాయకుడు బాలరాజు విమర్శించడం అర్థరహితమని మండల పార్టీ నేత రామాంజులనాయుడు, రైతు పార్లమెంటు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి ఖండించారు. **బుచ్చినాయుడుకండ్రిగ:** అన్ని వర్గాలను కలుపుకుని ప్రజా సేవకే అంకితమైన ఆదిమూలంపై బాలారాజు చేసిన ఆరోపణలు అర్థరహితమని నియోజక వర్గ టీడీపీ నాయా బ్రహ్మణ సంఘం అధ్యక్షుడు వేదాం వెంకటచలం పేర్కొన్నారు. **సత్యవేడు:** బాలరాజు ఆరోపణలను రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి పృథ్వీరాజ్, టీడీపీ నాయకుడు కోళ్ళ చిన్న ఖండించారు. ఎంపీటీసీ వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ అరుళ్ స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. **నాగలాపురం:** పార్టీలో దురుద్దేశ పూర్వకంగా నీచమైన రాజకీయాలకు పాల్పడటం తగదని మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు.

## ఉపాధి హామీ పనుల్లో అవినీతిపై విచారణ



ఆలయ ఆవరణలో విచారణ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 1: కళత్తూరులో ఉపాధి హామీ పథకం పనులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆదివారం అధికారులు విచారించారు. వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించి గ్రామస్థుల ఫిర్యాదుల చర్చించారు. శ్రీకాళహస్తి ఎంపీడీవో ప్రేమ్‌కుమార్, ఏపీవో గణేష్, జేఈ స్వామిదాస్ తదితరుల హాజరయ్యారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న 30మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీవో గణేష్ మాట్లాడుతూ విచారణ అంశాలను నివేదిక రూపంలో డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్, కలెక్టర్‌లకు అందజేస్తామని తెలిపారు.

## పవన్ కల్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఆదివారం ముందస్తుగా నిర్వహించారు. నాగలాపురం జేఆర్ కన్వెన్షన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు దాసు మణికంఠ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అన్నదానం నిర్వహించి, మొక్కలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం, సత్యవేడు, శ్రీకాళహస్తి, నగరి, జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జిలు లావణ్యకుమార్, వినుత మహేష్, పొన్న యుగంధర్, జిల్లా కార్యదర్శి హేమకుమార్‌తోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రదాత చంద్రబాబునాయుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: తెలుగు జాతి అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఎన్టీఆర్‌నగర్ కూడలి వద్ద కేక్ కట్‌చేసి టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నాయకులు శేఖర్, బాలయ్య, సులేమాన్, శివ, తేజ, కోటయ్య, రమేష్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, గోపి, లోకేష్, సుధాకర్, ముని, సురేష్, దాము పాల్గొన్నారు.

## దివ్యాంగులు, వృద్ధులకు వితరణ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: పేదవారికి సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యుడు గరికపాటి రమేష్‌బాబు అన్నారు. నగరవీధిలో హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు మునీర్‌బాషా, సభ్యులు రాజేశ్వరరావు, హరినాయుడు, డిల్లీ, బాబా ఫరీద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు ఎస్ఐకి సన్మానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఈశ్వరయ్యను ఆదివారం మండల టీడీపీ, బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో ఇసుక మాఫియాను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి మురళినాయుడు, బీజేపీ నాయకులు ఎస్వీ రమణ, వేడాం కృష్ణయ్య, రమేష్‌కుమార్, రవి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గిపేరిలో ఉచిత వైద్య శిబిరం



ఏర్పేడు, సెప్టెంబరు 1: దుర్గిపేరిలో ఆదివారం బ్రాలాజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 250మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి మునెయ్య, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడు సీఐకి సత్కారం

ఏర్పేడు, సెప్టెంబరు 1: సీఐగా బాధ్యతలు చేపట్టిన జయచంద్రను స్థానిక అంబేడ్కర్ యువజనసంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దళితసంఘాల ఆధ్వర్యంలో సన్మానించి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజనసంఘం నాయకులు వాసు, హరి, గురవయ్య, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎస్సీ ఎస్టీ జేఏసీ కన్వీనర్ ఏకాంబరం సీఐ జయచంద్రను సన్మానించారు.

## కారుణ్య నియామకాలు చేపట్టాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1: కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని ఏపీ ఎంఎస్ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు హరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల్లో 21మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలని కోరారు. మునిరత్నం తదితరులు పాల్గొన్నారు. జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడఇగా విహారి, ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారిగా విజయకుమార్‌ను ఎన్నుకున్నారు.



# పుత్తూరు వార్తలు

## ఎస్ఐగా బాధ్యతల స్వీకారం



ఓబులయ్య

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 1: ఎస్ఐగా ఓబులయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన వెంకటమోహన్ కృష్ణ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నాగలాపురం నుంచి ఓబులయ్య బదిలీపై పుత్తూరు వచ్చారు.

## వైభవంగా ఉట్లోత్సవం

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 1: తడుకులో కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తడుకు పరిధిలోని యువత, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## విశ్రాంత హెచ్‌ఎం హెన్రీకి నివాళులు



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 1: స్థానిక మెయిన్ స్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, జాతీయ స్థాయి ఉత్తమ పురస్కార గ్రహీత హెన్రీ భాస్కర్(79) ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయన సేవలను విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు భాస్కర్‌రాజు కొనియాడుతూ నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో యుగంధర్ రాజు, తదితరులు ఉన్నారు.

## పవన్ జన్మదినం సందర్భంగా రక్తదానం



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 1: డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ పుట్టినరోజు సందర్భంగా పుత్తూరులో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మహేష్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఆదివారం వేద వ్యాస విద్యానికేతన్ ఆధ్వర్యంలో తిరుపతి విజయశ్రీ బ్లడ్ బ్యాంకు సహకారంతో పార్టీ నాయకులు, యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కటికం నాగార్జున, జగదీశ్వర రాజు, కంచి దిలీప్, మెరుపుల నవీన్, మోనిష్, క్రాంతి, విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిమూలంపై అనవసర విమర్శలు చేస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నారాయణవనం, సెప్టెంబర్ 1: ఎమ్మెల్యే ఆదిమూలంపై టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు బాలరాజు, విమర్శలు చేయడం తగదని మండల నాయకులు భాస్కరన్ పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బాలరాజు వ్యక్తి గత సమస్యలుంటే ఎమ్మెల్యేకు విన్నవించాలే తప్పా విమర్శించడం తగదని గుర్తు చేశారు. నిజాయితీ మారుపేరు ఆదిమూలం అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. టీడీపీ నాయకులు కేఎస్. రవి, ఊరప్ప, సుబ్రమణ్యం, సుబ్రమణ్యం, హరి, మాణిక్యం, వేలు రెడ్డి, నరేష్, గోవిందశెట్టి, శివకుమార్, రమేష్, మునిబాబు, దయ, తిరుమలయ్య, సుధాబాబు, శేఖర్, ఆనందయ్య, జీవ, శివ, ఎంజీఆర్ మణి, నటరాజన్ పాల్గొన్నారు.

## దంపతుల వాహన వితరణ



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 1: పట్టణంలోని వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయానికి ఆదివారం సెంగుందర్ వీధికి చెందిన ఎబ్బూరు శ్రీనివాసులు, భానుమతి దంపతులు రూ.70 వేల విలువ చేసే మూషిక వాహనాన్ని అందించారు. ముందుగా ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి ఈ దంపతులు విశేష పూజలు చేశారు. అనంతరం మూషిక వాహనాన్ని ఊరేగించారు. వారికి ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



నారాయణవనం, సెప్టెంబర్ 1: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30వ ఏట అడుగు పెట్టిన సందర్భంగా ఆదివారంనాడిక్కడ పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. చంద్రన్న పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సంక్షేమ పథకాలతో వర్ధిలాలని వారంతా అకాంక్షించారు. కార్యక్రమంలో కేఎస్. రవి, ఊరప్ప, సుబ్రమణ్యం, సుబ్రమణ్యం, హరి, మాణిక్యం, వేలు రెడ్డి, నరేష్, గోవిందశెట్టి, శివకుమార్ పాల్గొన్నారు.